న్యూజెర్సీ కథల పోటీలో 150/-
గెలుచుకున్న రచన

# కర్ఫ్యూ

–ఉపద్రష్ట సాయి

ఎప్పుడూ రణగొణ ధ్వనులతో రద్దీగా కనిపించే నగరం వీధులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎవరి గూళ్ళలో వాళ్ళున్నారు. మత కలహాల పర్యవసానంగా జరిగిన హత్యలవల్ల చెలరేగిన కల్లోలాన్ని అదుపులోకి తేవడానికి కర్ఫ్యూ విధించారు. ఉన్న ఫళాన కర్ఫ్యూ ప్రకటించడంతో వున్న వాళ్ళు ఇబ్బంది పడక పోయినా బీద బిక్కీ, బిచ్చగాళ్ళు, కూలీలు మాత్రం విలవిల లాడిపోతున్నారు. ఏనాటి కానాడు రెక్కల కష్టం చేసి చేతిలో పడిన డబ్బుతో కడుపులో కొంత పడేయడానికి వెచ్చాల కొట్లకు పరుగెట్టే జనం, అటు కూలీ పోయి, ఇటు డబ్బూ లేక పోవడంతో ఆకలితో విలవిలలాడు తున్నారు. ఎందు కొచ్చిన ఈ గొడవలు అని విసుక్కుం టున్నారు. పెద్ద వాళ్ళువెలాగో సర్దుకున్నా పిల్లలు మాత్రం ఆకలి దెబ్బకు తట్టుకోలేక పెద్దగా ఏడుస్తు న్నారు.

ఈ నేపథ్యంలో పోలమ్మ దిక్కుతోచకుండా కూర్చుంది. ఇప్పుడో మరో క్షణమో కూలిపోయేలా వున్న పాడుబడ్డ భవనం వాకిట్లో పిల్లలతో కూర్చున్న పోలమ్మ అక్కడికి వచ్చి నెల రోజులే అయింది. రోడ్డు మీద మూటలు మోసే భర్త ఐదేళ్ళ క్రితం లారీ క్రింద పడి పోయాడు. తర్వాత అక్కడక్కడా ఇంటి పనులు చేస్తూ బతికే పోలమ్మ మూడు నెలల క్రితం తీవ్రంగా జబ్బు పడి పని చెయ్యలేని స్థితిలో, మరో గత్యంతరం లేక పిల్లల కోసం ముష్టెత్తుకోవడం ప్రారంభించింది. వున్న ఏరియాలో అడుక్కోవడానికి మనసు అంగీకరించక పోవడంతో కొత్త ప్రాంతానికి వచ్చిన పోలమ్మ ఒక నిర్మానుష్యమైన పాడుపడిన భవనంలో ఒక వారగా ఆశ్రయం ఏర్పరుచుకుని బతుకుతోంది.

పోలమ్మ పిల్లలు గుక్క తిప్పకోకుండా ఏడుస్తు న్నారు.

వారి బాధ చూస్తే ఆకలితో చచ్చిపోయేలావున్నారు. ఒక రోజు... కాదు... రెండు రోజుల బట్టీ తిండిలేని వాళ్ళు ఏడవడం సహజమే. పైగా కొడుకు ఏడేళ్ళవాడు, కూతురు ఐదేళ్ళపిల్ల! ఇద్దరూ ఆకలి తట్టుకోలేని పిల్లలు. కడుపు కింత పెట్టడానికి పోలమ్మ దగ్గర ఏమీ లేదు. నిన్న పొద్దున్నించి కర్ఫ్యూ అమలులో వుండడం మూలాన అడుక్కోవడానికి వీలుపడ లేదు. నిల్వ వుంచుకుని తినే పరిస్థితి కాదు పోలమ్మది.

మరిప్పుడెలా? ఎలాగైనా పోలీసుల కళ్ళు కప్పి, జవాన్ల కళ్ళు కప్పి వీధిలో ఏ చెత్త కుండీలోనైనా వెతికి రెండు ముద్దలు పిల్లలకు తెచ్చి పెట్టవచ్చు. మరి పోలీసుల కంట పడితే... చావు ఖాయం. తర్వాత తన పిల్లలు అనాథలై పోతారు. వాళ్ళ అదృష్టం బాగుంటే పోలీసుల కంట పడకుండా రెండు ఎంగిలాకులు దొరికినవి తీసుకు వస్తే పిల్లలు బతికి పోతారు. ఒక వేళ తను పోలీసుల కంట పడి చనిపోయినా తల్లిగా తన కర్తవ్యం చేస్తూ చచ్చి పోయానన్న తృప్తి మిగులుతుంది అనుకుంది పోలమ్మ.

అప్పటికే చీకటి ముసురుకు వచ్చేసింద. ఆలస్యం చెయ్యకూడదనుకుని మెల్లగా అటూ ఇటూ చూస్తూ గోడవారగా జరుగుతూ దూరంగా కనిపించే ఒక పెద్ద కాంపౌండ్ గేటు దగ్గరున్న చెత్త కుండీల దగ్గరికి వెళ్ళింది పోలమ్మ. ఆ కాంపౌండ్‌లో ఇరవై ఫ్లాట్స్ వున్నాయి. కనుక తప్పకుండా తినడానికి దొరుకుతుందని పోలమ్మ నమ్మింది. పోలమ్మ చేతులూ కాళ్ళూ వణుకుతున్నాయి. గుండె వేగంగా కొట్టుకుంటూంది. ప్రాణాలను అర చేతిలో పట్టుకుని వేగంగా చెత్త కుండీలో వెతుకుతున్న పోలమ్మ ఠక్కున ఆగింది. ఆ క్షణంలో పోలమ్మ కళ్ళు మెరిసాయి. అరిటాకులో చుట్టచుట్టి కొంచెం అన్నం, కూర, పచ్చడి, గారెలు కనిపించాయి. ఎవరింట్లోనో తినలేక పారేశారు. అదృష్టవంతులు- ఎంత గొప్ప వాళ్ళో వాళ్ళు. అనుకుంటూ ఆ ఆకును చుట్టి చీరెలో దాచుకుంది- నిజానికి పోలమ్మ కూడా బాగా ఆకలిగా వుంది. అందులో కొంచెం తను తినేస్తే... అనుకుంది. కానీ మనసు ఒప్పుకోలేదు. ముందు పిల్లలు... తర్వాతే... మిగిలితేనే తను... అనుకుంది పోలమ్మ... ఇంతలో ఎక్కడో దూరంగా పోలీసు విజిల్ విని పించింది. పోలీసు జీప్ హెడ్ లైట్లు కనిపిస్తున్నాయి. కనిపిస్తే కాల్చేస్తారు. ఠక్కున డస్ట్ బిన్‌లో దాక్కుంది పోలమ్మ.

మరి కొంచెం సేపట్లో విజిల్ చప్పుడు ఆగింది.

జీపు వెళ్ళిపోయింది. మెల్లగా డస్ట్ బిన్ లోంచి బయటపడ్డ పోలమ్మ తన గూటికి చేరుకుంది.

మరి కొంచెం సేపట్లో, ఆకలితో ఏడుస్తున్న పిల్లలు ఏడుపు మానేశారు. కానీ, ఆకులో ఒక్క మెతుకు కూడా లేకుండా తినేశారు.

పోలమ్మ కడుపులో ఆకలి మంట లేచింది.

'రెండు ముద్దలు తనకు మిగిలుంటే బాగుండేది' అనుకుంది. కానీ ఏ తల్లైనా, బిడ్డల ఆకలి తీర్చి, మిగిలితే తను తినాలనుకుంటుంది.

మర్నాడు మహానగరానికి తెల్లవారింది.

ప్రొద్దునే కర్ఫ్యూ సడలించడంతో నగరంలో మళ్ళీ రణగొణ ధ్వనులు ప్రారంభమయ్యాయి. జనం వేగంగా తిరుగుతున్నారు. కానీ పాడుపడిన భవనం వరాండాలో పడుకున్న పోలమ్మ పిల్లలు మాత్రం లేవలేదు. పొద్దెక్కినా లేవని పిల్లలను లేపడానికి ప్రయత్నించిన పోల మ్మకు తెలియదు, వాళ్ళు రాత్రే చచ్చిపోయారని.

తను వాళ్ళకి పెట్టిన అన్నంలో విషం కలిసుందని.

విషయం తెలిసిం తర్వాత పోలమ్మ గుండెలు బాదు కుంది. ఆ రెండు ముద్దలూ తిననందుకు తనను తాను తిట్టుకుంది. ●

